# విప్లవ యోగీశ్వరుడు



మహాకవి, సరస్వతీపుత్ర, పద్మశ్రీ

డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు

పుట్టపర్తి వారు ప్రధానంగా పండితులా లేక కవులా అనే సమస్య వస్తే పరిష్కరించడం చాల కష్టం. ప్రధానంగా పండితులు అంటే వారు రచించిన అసంఖ్యాక మృదుమధుర కవితలు ప్రత్యక్షమై వారు ప్రధానంగా కవులు అని జ్ఞాపకం చేస్తవి. అందుకని వారు ప్రధానంగా కవులు అందామా అంటే వారి అశేషపాండితి. వారి వివిధ భాషా విజ్ఞానం ముందుకువచ్చి వారు ప్రధానంగా పండితులు అని తెలుపుతవి. కనుక వారెవరూ అంటే వారు ప్రకాండ పండితకవులు. ప్రగాఢ కవిపండితులు అని మాత్రమే అనగలం: ద్రావిడ భాషావిజ్ఞానం అంతా వారికి కరతలామలకం. ప్రత్యేకించి మళయాళ సాహిత్యంలో వారు ఎంతగానో కృషిచేశారు. హిందీ, బెంగాలీ, ఒరియాలో కూడ మంచి పరిచయం సంపాదించారు. ఇక సంస్కృత. ఆంగ్ల భాషల్లో సరేసరి. అందుకే పుట్టపర్తివారికి ప్రసాదించబడిన "సరస్వతీపుత్ర" బిరుదు సార్థక్యత చెందింది వాస్తవ ప్రతిభతో ఏమాత్రం సార్థక్యత లేకుండా.

శ్రీ కృష్ణమూర్తి గారి డాబామీద పుట్టపర్తి వారితో మేమంతా గడపిన గ్రీష్మరాత్రులు ఆనందజ్యోత్స్నతో ప్రకాశించిన అనుపమరాత్రులు. నారాయణాచార్యులుగారి పాండితి లోకానికి తెలుసు, వారి కవితాప్రతిభ సహృదయులకు తెలుసు, కాని వారి మానవత కొద్దిమందికి మాత్రమే తెలుసు. వారి మానవతను సమీపంలోనుంచి తెలుసుకోనే అవకాశం నాకు దొరకుతుండేది. గ్రీష్మం మొదటిభాగంలో మేమంతా శ్రీ కృష్ణమూర్తి గారి డాబా మీద రాత్రులు నిద్రించేవారం. అందరూ నిద్రలో వున్నా చాలా ప్రొద్దుపోయేదాకా పుట్టపర్తి వారూ. నేనూ మేల్కొనివుండి సృష్టిరహస్యాలు, దేవుడూ, మానవుడూ, ఆస్తికవాదం, నాస్తికవాదం, సంశయవాదం, జననం, జీవనం, మరణం మొదలైన విషయాలనెన్నో చర్చించుకొనేవారం. కొన్ని విషయాలలో, ఆలోచనలలో, ఆచరణలలో వారి విప్లవాత్మక భావాలకు నేనాశ్చర్యపోయేవాడిని.

మా ఉభయుల ప్రయాణాలూ ఒకవేకువ వేళ నిర్ణయమైనవి. ఉభయులం ఎవరిత్రోవను వారు పోబోతూన్నందుకు అజ్ఞాతంగా వేదన చెందసాగేం. సరే మళ్లీత్వరలో కలుసుకోగలం అనే అశాకిరణం ఆ వేదనను కొంతవరకు తగ్గించింది. శ్రీ పుట్టపర్తి ఒక ప్రోజ్వల జ్వాల ఆయనొక ఆనంద కిరణ మాల.

**– శ్రీ సంజీవదేవ్**

**(కడప-శ్రీ రామకృష్ణ హైయ్యర్ సెకండరీ స్కూల్ మాగజైన్, 1963-64 సంచిక నుంచి**

# విప్లవ యోగీశ్వరుడు

వంగీయుల స్వభావము విచిత్రమైనది. ఏదైనను నొక క్రొత్తది పుట్టిన వెంటనే వారు దాని నాహ్వానింతురు. వారి సాహిత్యముగూడనంతే. సామాజిక జీవనముగూడనంతే. పాశ్చాత్య నాగరికత – వింత వింతలైన వాలకములతో భారతదేశమునఁ దొంగిచూచినది. మాదకములైన యామె కటాక్షములకు దొట్టతొలుత లోఁబడి – కర్తవ్యమును మఱచిన జనులు వారే. పాశ్చాత్యుల యాచార వ్యవహారములను మనసార నలవఱచుకొనిరి. అనేకులు వంగీయులు విచార రహితముగ క్రైస్తవ మతమును స్వీకరించిరి. మతకర్తలందరు గొప్పవారే. వారొనర్చిన బోధలన్నియు నించుమించు నింతే. ఒక మతమును లేని గొప్పతనము – వేరొకట నున్నదని భావించుట మన యవివేకమే. కాని– యావేశము వివేకమును దోపనివ్వదు. మహత్త్వాకాంక్షులయున వంగీయులు పాశ్చాత్య నాగరికతా వాగురములలోఁ దగుల్కొన్న వెంటనే – యితర రాష్ట్ర ప్రజలు గూడ వారి ననుసరించిరి. దేశమంతయు నొక యూకున పాశ్చాత్య సభ్యతా మయమై పోయినది. దానికిఁదోడు – ప్రభుత్వము గూడ నట్టివారిని బ్రోత్సహించు చుండెను. మతాతరులైన వారికి గొప్ప యద్యోగము లిచ్చుచుండిరి. ఇవ్వకున్నను – యిచ్చినంత యాశ జూపుచుండిరి. ఇంగ్లీషు భాష మన దేశమున క్రొత్తగా వ్యాపించినపుడు – రెండవ ఫారమున గడతేరిన వారికిగూడ పెద్ద పెద్ద యుద్యోగములిచ్చిరట! రాజకీయముగ నిది యొక పెద్దకుట్ర. మన సంస్కృతిపై యభిమానము లేకుండ జేయుటకై యాంగ్ల ప్రభువులట్లొనర్చిరి. బీదఱికముతో ధనమునకు మొగము వాచియున్న మనుష్య లాంగ్ల విద్యాభ్యాసమున కెగబ్రాకినారు. దేశ భాషలలోను–సంస్కృతములోను పరిశ్రమ చేసిన పండితులకు బ్రతుకు తెరువులు కరవయ్యెను. చదివిన నాలుగు శాస్త్రములుగూడ పండితుని జేనెడుపొట్టను పూడ్చలేకపోయినవి. మొన్నటి వరకును – పండితులకు కూడులేకున్నమానె – గౌరవమును లేకుండెను. నేటి ప్రభుత్వము – గౌరమునిచ్చితి మనుచున్నారు. కాని – యా పలుకులు కార్యమున, బరివర్తితమగు కాలమింకను నెంతదూరమును నున్నదో – యింకను దెలియుట లేదు.

వంగీయులు – పరిణామశీలులంటిమి. పాశ్చాత్యవ్యామోహమున బడిన వారట్లే చాలకాలముండలేదు. వెంటనే యాత్మపరిశోధనకు దిగినారు. “మనదేశ మెట్టిది? మన సంస్కృతియొక్క స్వభావ మేమి? మన జాతి యొకనాఁడేమైయుండెను? నేఁడేమైనది?” యను ప్రశ్నలు వారినిఁ గలఁతపెట్ట నారంభించినవి. గాలి మరియొక వైపునకు గొట్టినది. ఉద్రిక్తులైన వంగీయు లొక్కసారి మేల్కొనిరి ఋష్యంశము గల బంకించంద్రుడు “ఆనందమఠ” యను నవలను వ్రాసెను. ఆనవలలో నాటి భారతీయుల యాత్మ స్వాతంత్ర్యమునకై యెట్టు గొటుకులాడుచుండెనో స్పష్టముగ జెప్పఁబడినది. ఆ నవలలో నాతఁడు “వందేమాతరం” అను పదమును వాడినాఁడు. వాడినదే తడవావాక్యము దేశమునఁ జిచ్చువలె వ్యాపించెను. ప్రతిహృదయమున నా పిలుపు గదలించివేసెను. దేశమనఁగా మట్టి గాదనియు–నామె యనంత

జీవరాశులకు మాతృస్వరూపిణి యనియు నొక భావము భారతీయుల హృదయములందొక మెఱపువలె మెఱసినది; ఆ మాటలను బంకించంద్రుఁడు ఋషియై వాడెను. ఒక్కొకరి వాక్య మంత పని చేయును. ఆ సమయమున వారి నోటి నుండి యా మాటను – పరమేశ్వరుడే బలికినాఁడా యని అనిపించును.

గత శతాబ్దమున మన సంస్కృతికి సాకారమైన రూపముగ – రామకృష్ణ పరమహంస ప్రవర్తిల్లెను. పాశ్చాత్య వ్యామోహితమైన దేశమున – నాస్తికులైపోవు ప్రమాద ముండెను. అనేక హృదయములు భగవంతుఁ డున్నాఁడా యని ప్రశ్నించుచుండెను. ధీరుఁడై యా ప్రశ్నల కెదురొడ్డి నిలిచి – రామకృష్ణపరమహంస “ఉన్నాఁడ”ని చాటిచెప్పెను. మహోద్రేకియైన వివేకానందుడు “మీరు భగవంతుని జూచితిరా” యని పరమహంసను ప్రశ్నించెను. అధ్యాత్మికానుభూతిలోనే యణువు సందేహము మిగిలియున్నవారైనను – పయోవాహగర్జా గంభీరమగు నా ప్రశ్నకు చలించిపోయి యుండెడివారే. కానీయా మహర్షికి దన యనుభవమున సందేహములేదు. మన కన్నుల కీ మాయావృతమైన లోకమెంత స్పష్టముగ భాసించుచున్నదో – యంత స్పష్టముగ నా మహనీయుని యంతర్దృష్టికి దైవతత్త్వము భాసించుచుండినది. రామకృష్ణుఁడు “ఔనౌను. చూచితి” నన్నాడు. ఈ యాత్మ ప్రత్యయమునకు వివేకానందుఁడు చలించిపోయినాఁడు. అతఁడు పరమహంస శ్రీచరణముల వ్రాలినాఁడు దయామేదురుఁ డైన రామకృష్ణుఁడు సాధనలోని రహస్యముల నాతనికి విప్పి చెప్పెను. సిద్ధిని గరతలామలకముగ నొనర్చెను. వివేకానందుఁడొక హిమగిరి శిఖరము; అతని యావేశ మంతులేనిది. తుకారాముఁడు – ఆధ్యాత్మిక పురుషుఁడొక మహావీరుఁడని వర్ణించెను. కామక్రోధాదులే యాతని ప్రతిపక్షులు, విజ్ఞానఖడ్గమే వాని యాయధము. తుకారాముఁడు చెప్పిన మహావీరలక్షణములన్నియు వివేకానందున కుండినవి. పైగా నతఁడు గొప్ప విద్యావంతుఁడు. ప్రాచ్య పాశ్చాత్య విజ్ఞానములఁ గూలంకషముగ నాపోశనము వట్టిన మనీషి. సంశయము తీరిన వివేకానందుఁడు – దేశము నలుమూలల భారతాత్మ యెట్టిదో వ్యక్తపఱుప సాఁగెను. ఆ ప్రతిభపాశ్చాత్య దేశములలోఁ గూడ వాసనలు గుబాళించెను. మహా మేధావుల మనుకొన్న ఐరోపీయులు–వివేకానందుని ప్రతిభాబలమునకు మోకరిల్లిరి. ఇట్టి దేశమునకు దాము క్రైస్తవ ప్రచారకుల పంపుట యెంతటి పొరపాటో యపుడు వారి కర్థమైనది. వివేకానందునితోఁబాటు – మరికొందఱు మహాపురుషులు జన్మించిరి.

వంగదేశము – ఇట్టి నూత్న వికాసముల నందుచుండిన సుముహూర్తములో – నరవిందుఁ డుద్భవించెను. ఆయన జన్మించినది ఆగష్టు పదునైదవ తేదీనాడు. ఆదినము భారతీయుల కత్యంత ప్రముఖమైనది. కలియుగ మందుగూడ – భగవంతుని మాంస చక్షువులతో – దర్శింపఁగల సమర్థులున్నారని –పాశ్చాత్య వ్యామోహిత దేశమునకు స్పష్ట మొనర్చినది. రామకృష్ణ పరమహంస మహాసమాధి నందిన దాదినముననే. ఏసుక్రీస్తు కన్నతల్లి మేరీకన్య. ఆమెను దేవతలు స్వర్గమునకుఁగొంపోయినది నాఁడేయుని క్రైస్తవులు విశ్వసింతురు. అరవిందయోగి యవతరించిన ఆగష్టు పదునైదవ తేదీయందే–భారతదేశమునకు స్వాతంత్ర్యము

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Viplava+Yogiswarudu**

* * *